క్లుప్తంగా

కేంద్రియ విద్యాలయం నిర్మాణ స్థల పరిశీలన



మాచర్ల రూరల్: మండల పరిధిలోని తాళ్ళపల్లి గ్రామ శివారులో నిర్మాణం తలపెట్టనున్న కేంద్రియ విద్యాలయ స్థలాన్ని న్యూ ఢిల్లీ అడిషనల్ కమిషనర్ వీఆర్ నాథ్, రీజనల్ అధికారి కేవీఎస్‌లు గురువారం తమ బృందంతో పరిశీలించారు. స్థలంలో నిర్మాణానికి కావాల్సిన ఎలక్ట్రిసిటీ, అప్రోచ్ రోడ్డు, భవన నిర్మాణాలు, నీటి వసతి తదితర విషయాలపై నిశితంగా పరిశీలించారు. అనంతరం తాత్కాలికంగా కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయు పాఠశాలలైన జెడ్పీ బాయిస్, సెయింటాన్స్ బాలికోన్నత పాఠశాల, విజయపురిసౌత్‌లోని పాఠశాలలను కూడా వారు పరిశీలించారు. గదుల సామర్థ్యం విద్యార్థులకు క్రీడా, విద్యా వసతి, ఉద్యోగులు, సిబ్బందికి గృహ సముదాయాలను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రీజనల్ అధికారి కేఎస్ఎన్ ప్రసాద్, మండల ప్రత్యేకాధికారి గబ్రూ నాయక్, తహసీల్దార్ వి.కిరణ్ కుమార్, ఎంపీడీఓ ఫణి కుమార్, ఎంఈఓ అల్లి సురేష్, డీఈ పి.విభూషణ్, అధికారులు సర్వేయర్ రఘుపతి, కేవై రాజు, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, ఎస్ఐ సంధ్యారాణి తదితరులున్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకూడదు

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



గురజాల రూరల్ : మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని దేవాలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అసౌకర్యం కలగకుండా చూడాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అధికారులకు ఆదేశించారు. మండల పరిధిలోని దైద గ్రామంలోని గురువారం అమరలింగేశ్వరస్వామి దేవాలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ మహాశివ రాత్రి రోజు దేవాలయాలకు వచ్చే భక్తులకు కూటమి నాయకులు సహాయ సహకారాలు అందిస్తారన్నారు. అనంతరం జంగమహేశ్వర పురంలోని ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ కన్వీనర్ అడపా శ్రీనివాసరావు, పులుకూరి కాంతరావు, ఎస్.బొల్లయ్య, శరమాళ్ల హనుమంతరావు, వెంపటి సాంబశివరావు, కె.అంకారావు, పాతూరి రామకృష్ణ, జినగా దావీదు, చింతకాయల కళ్యాణ్ కూటమి నాయకులు తదితరులున్నారు.

విప్రో సంస్థకు ఎంపికైన న్యూటన్స్ విద్యార్థులు



మాచర్ల రూరల్: ఆధునిక సాంకేతిక రంగంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ విప్రోలో న్యూటన్స్ కళాశాలకు చెందిన విద్యార్థులు క్యాంపస్ డ్రైవ్‌లో ఎంపిక కావటం ఎంతో గర్వకారణమని న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో విప్రో కంపెనీ వారు నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో ఎంపికైన విద్యార్థులను అభినందించి మాట్లాడారు. విప్రో సంస్థలో 27 మంది విద్యార్థులు క్యాంపస్ డ్రైవ్‌లో ఎంపిక కావటం అభినందనీయమని క్రమశిక్షణ, చిత్తశుద్ధితో విద్యనందుకుంటే ఉద్యోగ అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయనేదానికి ఇదే నిదర్శనమని, ప్రతి ఒక్కరూ అధ్యాపకులు అందిస్తున్న బోధన, శిక్షణలను క్రమశిక్షణతో అలవర్చుకొని చదువుకోవాలని కోరారు. క్యాంపస్ డ్రైవ్‌లో ఎంపికకు కృషి చేసిన అధ్యాపకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్‌రెడ్డి, టీపీఓ రామ్మోహన్‌రెడ్డి, హెచ్ఓడీఎస్‌లను ఆయన అభినందించారు.

వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్ల పరిశీలన



మాచవరం: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 15 నాటికి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లలో పూర్తి స్థాయిలో పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంగళరావు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు గ్రామాల్లో నిర్మించిన షెడ్లలో తడి పొడి చెత్తను వేరు చేసే విధంగా ఏర్పాట్లు చేసామన్నారు. చెత్త నుంచి వర్మీ కంపోస్టు తయారు చేసేందుకు పంచాయతీ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు

ధర లేక.. దిగుబడులు రాక

- నష్టాల్లో మిర్చి రైతులు
- పెట్టుబడులు వస్తాయా అని అనుమానం
- క్వింటా రూ.8 వేల నుంచి రూ.12 వేలు ధర
- కోల్డ్ స్టోరేజీలకే పరిమితం చేస్తున్న రైతులు



కల్లంలో ఎండబోసిన మిరప కాయలను ఏరుతున్న కూలీలు

వెల్దుర్తి: రైతులు పండిస్తున్న మిర్చి పంటకు సరైన మద్దతు ధర లేక అప్పులపాలై ఆందోళనకు గురవుతున్నారు. అదే విధంగా మిర్చికి తెగుళ్ల సోకి దిగుబడులు కూడా సరిగా రాక రైతులు దిగులు చెందుతున్నారు. దాదాపు రెండు సంవత్సరాలుగా మిర్చి పంటను సాగు చేస్తున్న రైతులకు పెట్టుబడులు అధికమై పంటలు సరిగా పండక అప్పుల పాలవుతున్నారు. రైతులు సాగు చేసే మిర్చి పంటకు ఎర్ర నల్లి పురుగు సోకి పంటల దిగుబడి తగ్గిపోయి కాయలు తెల్లగా తయారవుతున్నాయి. పండించిన పంటకు వచ్చే అరకొర దిగుబడులకు కూడా సరైన మద్దతు ధర లేక కోల్డ్ స్టోరేజీలలో నిల్వ చేస్తున్నారు. మిర్చి పంటకు ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు పెట్టుబడి అవుతుంది.

కోల్డ్ స్టోరేజీలకే పరిమితం

గత ఏడాది పండించిన మిర్చికి మొదట్లో రేటు బాగా ఉన్నప్పటికీ రైతులు ఇంకా ఎక్కువ ధర పలుకుతుందని కోల్డ్ స్టోరేజీలలో నిల్వ చేశారు. గత ఏడాది మొదట్లో క్వింటా దాదాపు మిర్చి రకాన్ని బట్టి రూ.22 వేల నుంచి రూ.52 వేల వరకు పలికింది. కాగా ఇంకా ధర వస్తుందని ఆశించిన రైతులు కోల్డ్ స్టోరేజీలలో నిల్వ చేశారు. ఆ మిర్చికి లోన్లు తీసుకున్నారు. కానీ ఆ తరువాత ధర రూ.12,000 వరకు తగ్గిపోవటంతో రైతులు మిర్చిని అమ్ముకుండా కోల్డ్ స్టోరేజీలలోనే నిల్వ ఉంచారు. ఈ ఏడాది మండలంలో 12 వేల ఎకరాలలో మిర్చి పంటను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా మిర్చి పంటకు తెగులు, నల్లి సోకి పంట పూర్తి స్థాయిలో తగ్గిపోయిందని రైతులు చెబుతున్నారు. పండించిన పంటకు ధర లేకపోవటంతో ఈ ఏడాది కూడా కోల్డ్ స్టోరేజీలకు తరలిస్తున్నారు. కాగా ఈ ఏడాది కూడా క్వింటా మిర్చి రకాన్ని బట్టి రూ.8 వేల నుంచి రూ.12 వేల వరకు పలుకుతుండడంతో పెట్టిన పెట్టుబడులు తీర్చలేక ఎరువు కొట్ల వారికి డబ్బులు చెల్లించలేక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మిర్చి పంటకు ధర లభిస్తే పెట్టుబడులు వెళతాయని రైతులు చర్చించుకుంటున్నారు.

సరైన ధర లేకపోవటంతో నష్టాలు



ఆరుగాలం కష్టపడి పండించిన మిర్చి పంటకు సరైన ధర లేకపోవటం వలన పెట్టుబడులు వెళ్తాయా లేదా అని ఆందోళనగా ఉంది. గత ఏడాది మిర్చికి మద్దతు ధర లేకపోవటంతో అప్పులపాలయ్యాం. ఈ ఏడాదైనా మిర్చి పంటకు సరైన ధర వస్తే నష్టాలు తీర్చుకుంటాం. 10 ఎకరాలలో మిర్చి పంటను సాగు చేశాను. రూ.15 లక్షలకు పైగా పెట్టుబడి అయ్యింది. 90 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదు.

– దేశం ఈశ్వరరెడ్డి, రైతు, మందాడి

3 ఎకరాలలో పంట ఎండిపోయింది



మిర్చి పంటను సాగు చేయాలంటే సుమారు రూ.2 లక్షల వరకు పెట్టుబడులు అవుతున్నాయి. పురుగు, నల్లి తెగులు సోకి పంటలు నాశనమైపోతున్నాయి. పంటను కాపాడుకునేందుకు అధిక పెట్టుబడులు పెట్టాల్సి వస్తుంది. 7 ఎకరాలలో మిర్చి పంటను వేశాను. మూడు ఎకరాలలో పంట ఎండిపోయింది. నాలుగు ఎకరాలకు రూ.8 లక్షల పెట్టుబడి అయ్యింది. పెట్టుబడులు వస్తాయో, రావోనని భయంగా ఉంది.

– బారెడ్డి ఆదిరెడ్డి, రైతు, మందాడి

వైరస్ సోకి నష్టాలొస్తున్నాయి



మిర్చి పంటకు వైరస్ సోకి పంట దిగుబడి తగ్గిపోయింది. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తున్నాం. కాసిన మిరప కాయలు కూడా తెల్లకాయలవుతున్నాయి. దుక్కుల నుంచి కాయలు కోసేంత వరకు లక్షల రూపాయల పెట్టుబడులు పెడుతున్నాం. ధర లేకపోవటం వలన నష్టపోయి అప్పులపాలవుతున్నాం. ఈ ఏడాదైనా మిర్చికి సరైన రేటు వస్తే పెట్టుబడులు వచ్చే అవకాశముంది.

– కొణతం సైదారెడ్డి, మందాడి

క్రీస్తు సూక్తులు ఆచరించి తోటివారిని ప్రేమించాలి

ఫాదర్ అనీల్‌కుమార్

రెంటచింతల: క్రీస్తు సూక్తులు ఆచరించి తోటివారిని ప్రేమించాలని గురువులు రెవ.ఫాదర్ అనీల్‌కుమార్(యూనివర్సల్ ఇంజనీరింగ్ కళాశాల) అన్నారు. స్థానిక కానుకమాత చర్చి 175వ వజ్రోత్సవ తిరునాళ్ల వేడుకలు పురస్కరించుకుని గురువారం విచారణ గురువులు రె.ఫాదర్ ఏరువ లూర్దుమర్రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పిచ్చుకల గడ్డ వద్ద నవదిన ప్రార్థనలలో భాగంగా నిర్వహించిన పవిత్ర సమిష్టి దివ్య పూజాబలిలో ఫాదర్ అనీల్‌కుమార్ భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. క్రీస్తు విశ్వాసులు ప్రతి రోజు కుటుంబ ప్రార్థనలు చేసి కరుణామయురాలు కానుకమాత ఆశీస్సులు పొందాలన్నారు. ఈ సమిష్టి దివ్య పూజాబలిలో సహాయ గురువులు అగస్టీన్, కన్యాస్త్రీలు, చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

మాస్టర్ చెఫ్ కార్యక్రమం



మాచర్ల: పట్టణంలోని రామాటాకీస్ లైన్‌లో నారాయణ స్కూల్‌లో మాస్టర్ చెఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం ఈ కార్యక్రమంలో చిన్నారులు ప్రదర్శించిన వివిధ రకాల వంటకాలు పరిశీలించిన హెచ్ఎం ఉల్లారెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో తప్పనిసరిగా పిల్లలు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. ఆ దిశగా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఇన్‌చార్జి ఆంజనేయులు, సునీత, శివకిరణ్ రాజ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి



వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ పోలూరి, కమిషనర్ వేణుబాబు



ఏపీటీడబ్ల్యూఆర్ స్కూల్లో అమరవీరులకు నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాలరావు



గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ తదితరులు



గాంధీజీకి నివాళులర్పిస్తున్న నాయకులు

పలు చోట్ల గాంధీ వర్ధంతి కార్యక్రమాలు

మాచర్ల: పట్టణంలోని మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని పలు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం వాసవీ క్లబ్ మాచర్ల చెన్నకేశవ సంఘం ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతిని నిర్వహించి ఆయన సేవలను కొనియాడారు. గాంధీ వర్ధంతి కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, వ్యవస్థాపక అధ్యక్షుడు తిరివీధి వెంకట నాగేశ్వరరావులు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు మాట్లాడుతూ శాంతి, సహనంతో దేశానికి స్వాతంత్య్రం తీసుకొచ్చిన మహనీయుడిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు, మేడం నాగేశ్వరరావు, బచ్చు రామారావు, సాంబశివరావు, బచ్చు రాజ్ కుమార్, పందిరి నరసింహారావు తదితరులు పాల్గొని నివాళులర్పించారు. అలాగే పట్టణంలో గాంధీ వర్ధంతిని రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ డి.వేణుబాబు, మేనేజర్ జి వెంగయ్యలు పాల్గొని గాంధీజీకి నివాళులర్పించారు. అదే విధంగా రామకృష్ణ సేవా సమితి, వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి, మాతాజీ తంగిరాల విజయల ఆధ్వర్యంలో గాంధీజి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడారు.

అమరవీరులకు ఘనంగా నివాళులు

కారెంపూడి: అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని స్థానిక ఏపీ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో గురువారం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు జాతిపిత మహాత్మాగాంధీతో పాటు దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని ఆర్యవైశ్య సంఘ నాయకులు నిర్వహించారు. జాతిపిత విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు చీతిరాల కోటేశ్వరరావు, కొలిశెట్టి మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే పలు పాఠశాలల్లో కూడా అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశం కోసం పోరాడి అమరులైన వీరులకు ఘనంగా నివాళులర్పించారు.

పిడుగురాళ్లలో...

పిడుగురాళ్ల: జాతిపిత మహాత్మాగాంధీని సమాజంలోని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఆర్ అండ్ బీ బంగ్లా సెంటర్‌లోని గాంధీ విగ్రహం వద్ద గురువారం గాంధీజీ కాంస్య విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, పల్నాడు హాస్పటల్ అధినేత, వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ హాజరై గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతితో ఎంతటి విజయమైన సాధించవచ్చని చెప్పిన మహనీయుడు గాంధీ అన్నారు. అందుకే ప్రతి ఒక్కరు ఆయన శాంతి మార్గంలో నడవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, కాంస్య విగ్రహ కమిటీ అధ్యక్షుడు జూలకంటి శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్ పసుపులేటి ఆనంద్, ఆర్యవైశ్య నాయకులు ఆలేటి కనకయ్య, కోటా బుచ్చిబాబు, గొపవరపు హనుమంతురావు, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ పతంగి అమర్, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గురజాలలో...

గురజాల : జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని గురువారం స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ సర్పంచ్ ఏచూరి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ ఆంగ్లేయుల పాలన నుంచి దేశానికి స్వాతంత్య్రం సాధించిన ఘనత గాంధీకి దక్కుతుందన్నారు. శాంతి, మానవతావాదం వంటి ఆయుధాలతో స్వాతంత్య్రం తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు గుండా కాశీవిశ్వనాథం, బండి రవికుమార్, కనకం హనుమంతరావు తదితరులున్నారు.

మహాత్ముని అడుగుజాడలలో నడుద్దాం

గురజాల డీఎస్పీ బి.జగదీష్



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఎస్పీ

రెంటచింతల: జాతిపిత మహాత్మాగాంధీ అడుగుజాడలలో నడిచి ఆయన ఆశయ సాధనకు కృషి చేద్దామని గురజాల డీఎస్పీ బి.జగదీష్ అన్నారు. గురువారం మహాత్ముని వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో గాంధీ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. మహాత్ముడు బోధించిన అహింస, శాంతి సిద్ధాంతాలను ప్రపంచ దేశాలు ఆచరిస్తున్నాయన్నారు. అనంతరం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, ప్లేట్లు పంపిణీ చేశారు. స్థానిక రామాలయం సెంటర్లోని గాంధీ విగ్రహానికి వైఆర్ఎస్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్, ఆర్యవైశ్య మండల మాజీ అధ్యక్షుడు ఏచూరి వెంకట సైదయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.మోహన్, ఎన్.శ్రీనివాసరావు, నాళం పెదబాబు, గుంటక కాశిరెడ్డి, నాళం చినబాబు, గుండా రామ్మూర్తి, కర్నాటి కోటయ్య, అయోధ్య రాముడు, ఏచూరి ముసలయ్య పాల్గొన్నారు.

ఏఐఎం సభను విజయవంతం చేయండి

పల్నాడు జిల్లా అధ్యక్షుడు పాశం శ్యామ్



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు పాశం శ్యామ్

పిడుగురాళ్ల: అంబేడ్కర్ ఇండియా మిషన్ (ఏఐఎం) సభ విజయవాడలో ఫిబ్రవరి 2న జరుగుతుందని, ఈ సభను విజయవంతం చేయాలని పల్నాడు జిల్లా అధ్యక్షుడు పాశం శ్యామ్ తెలిపారు. పట్టణంలోని ఏఐఎం కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎం జెండాను ఆవిష్కరించారు. శ్యామ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని చెప్పారు. ఈ బహిరంగ సభకు పల్నాడు జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు హాజరై ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎం కార్యవర్గ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు

ప్రభుత్వ గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి

మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీధర్

పిడుగురాళ్ల: మున్సిపల్ కార్యాలయ పరిధిలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ గృహాలు త్వరగా పూర్తి అయ్యే విధంగా హౌసింగ్ అధికారులు విధులు నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం ప్రభుత్వ గృహ నిర్మాణాలపై రివ్యూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీధర్ మాట్లాడుతూ పిడుగురాళ్ల మున్సిపల్ శాఖ కార్యాలయ పరిధిలోని గృహ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. అయితే లక్ష్యాలను పెట్టుకొని నిర్మాణాలను కొనసాగిస్తే మరింత వేగంగా పనులు జరుగుతాయన్నారు. అందుకే టార్గెట్ పెట్టుకోని అంధికారులు నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసే విధంగా విధులు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రసవత్తరంగా ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శన



ప్రథమ బహుమతిని పొందిన బాపట్ల జిల్లా గిత్తలు

రెంటచింతల: ఫిబ్రవరి 2న నిర్వహిస్తున్న స్థానిక కానుకమాత చర్చి వజ్రోత్సవ తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శన రసవత్తరంగా జరిగింది. 6 పండ్ల సైజ్ విభాగంలో జరిగిన ఈ ప్రదర్శనలో బాపట్ల జిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీషాచౌదరి గిత్తలు 4,500 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతి, గుంటూరు జిల్లా మండల కేంద్రమైన పెదపరిమి గ్రామానికి చెందిన మోదుగుల రామిరెడ్డి గిత్తలు 4,049.6 అడుగుల దూరంతో 2వ బహుమతి, గుంటూరు జిల్లా పెదకూరపాడుకు చెందిన ఎటుకూరి శ్రీనివాసరావు, తెలంగాణ సూర్యపేట జిల్లా రామలక్ష్మిపురంకు చెందిన గూడా శ్రీనివాసరావు కంబైన్డ్ గిత్తలు 3,600 అడుగులతో 3వ బహుమతి, కృష్ణా జిల్లా ఎనమలకుదురుకు చెందిన అనంతనేని శ్రీకావ్య, మధు గిత్తలు 3,487.3 అడుగులతో 4వ బహుమతి, పల్నాడు జిల్లా చల్లగుండ్లకు చెందిన మేక అంజిరెడ్డి గిత్తలు 3,347.1తో 5వ బహుమతి, పల్నాడు జిల్లా గోగులపాడుకు చెందిన ఎం.చిన్న వెంకటరెడ్డి, పిన్నెల్లికి చెందిన వి.శ్రీలాస్య మనోజ్‌ల గిత్తలు 3,117తో 6వ బహుమతి, ప్రకాశం జిల్లా అచ్చంపేట వై కొత్తపల్లికి చెందిన హస్విన్ గిత్తలు 3,000తో 7వ బహుమతి, బాపట్ల జిల్లా బోయినపాలెంకు చెందిన శ్రీ కృష్ణ యాదవ్ యూత్ గిత్తలు 2,653.4తో 8వ బహుమతి, తెలంగాణ నల్గొండ జిల్లా కాల్వపల్లికి చెందిన మండలి శ్రీను యాదవ్ గిత్తలు 2,003తో 9వ బహుమతి గెలుచుకున్నాయి. ఈ బల ప్రదర్శనలో మొత్తం 10 జతలు పాల్గొన్నాయి. మిగిలిన జతకు కూడా రూ.3 వేలు అందజేసినట్లు కమిటీ సభ్యులు వైఎల్ మర్రెడ్డి, ఆదూరి ఇన్నారెడ్డి, అల్లం ప్రతాప్‌రెడ్డి, గొంటు సుమంత్‌రెడ్డి, ఇన్నారెడ్డి, రామకృష్ణ, రాజారెడ్డి, చిన్న శౌర్రెడ్డి, జోసఫ్ రెడ్డి తెలిపారు.

ఎన్నికల కోడ్ అమలు

దుర్గి: గుంటూరు–కృష్ణా పట్టభద్రుల ఎన్నికలకు ఎన్నికల షెడ్యూలు జనవరి 29న విడుదల చేసినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నేటి నుంచి మోడల్ కోడ్ అమలులోకి వస్తుందని ఎన్నికల ప్రక్రియ మార్చి 8వ తేదీ పూర్తయ్యే వరకు అమలులో ఉంటుందన్నారు. మండల, మున్సిపల్, గ్రామ, వార్డ్ స్థాయి అధికారులు, ఉద్యోగులు, ప్రైవేటు సంస్థల అధికారులు, రాజకీయ నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజలు గమనించి మోడల్ కోడ్ నియమాలు పాటించాలని ఆదేశించారు. కోడ్ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

వైద్యశాల కాంట్రాక్టు కార్మికుల సమస్య పరిష్కారం



మాచర్ల: రాష్ట్ర వ్యాప్తంగా కూటమి అధికారంలోకి వచ్చాక తమకిష్టం లేని వారందరినీ తీసివేస్తూ కొత్తగా తమకు అనుకూలమైన వారిని ఉద్యోగంలో నియమించేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. అందులో భాగంగా మాచర్ల మండలంలోని విజయపురిసౌత్ ప్రాజెక్టు కమ్యూనిటీ ఆసుపత్రిలో ప్రైవేటు కాంట్రాక్టు సెక్యూరిటీ సిబ్బందిని తొలగించాలని దుర్మార్గమైన ఆలోచన చేశారు. ఈ నేపథ్యంలో ఆవేదనకు గురైన బొల్లెద్దుల అమృతమ్మ బుధవారం రాత్రి ఫినాయిల్ తాగి ఆత్మహత్యకు యత్నించింది. సకాలంలో వైద్యం అందించటంతో ప్రమాదం నుంచి బయట పడింది. విషయం తెలుసుకున్న రాష్ట్ర హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూదోట ప్రకాష్, నియోజకవర్గ ఏఐటీయూసీ కార్యదర్శి ఎం.బాబురావు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు అన్నమ్మలు విజయపురిసౌత్‌లోని ప్రభుత్వాసుపత్రి వైద్యులతో చర్చించారు.దీంతో వైద్యులు జిల్లా వైద్య శాఖ కోఆర్డినేటర్ రంగారావుతో చర్చించగా ఆయన ఉన్నత అధికారులతో మాట్లాడి కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులను విధుల్లో కొనసాగిస్తామని తెలిపారు. కూటమి నాయకులు ఏదో విధంగా తమ వారిని విధుల్లో చేర్చుకోవటం కోసం ప్రయత్నాలు చేసినా పేద కుటుంబాలకు చెందిన కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన చెందటంతో స్పందించి న్యాయం చేసేందుకు హామీనివ్వటంతో సమస్య పరిష్కారమైంది. ఈ నేపథ్యంలో కాంట్రాక్టు కార్మికులు వైద్యులు, యూనియన్ నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్లెక్సీలను తొలగించండి

ఎంపీడీఓ డి.ప్రసాద్

వెల్దుర్తి: గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ రావటంతో మండలంలోని వివిధ గ్రామాలలో ఫ్లెక్సీలను తొలగించాలని ఎంపీడీఓ డి.ప్రసాద్ కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల తేదీ వెలువడటంతో గ్రామాలకు చెందిన వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలోని ఫ్లెక్సీలన్నింటినీ తొలగించాలని ఆయన కోరారు.

ఫిబ్రవరి నాటికి సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి

కారెంపూడి: ఫిబ్రవరి నాటికి మండలంలో నిర్మిస్తున్న అన్ని సిమెంటు రోడ్లను పూర్తి చేస్తామని ఇన్‌చార్జి పీఆర్ ఏఈ డి.సత్యనారాయణ గురువారం తెలిపారు. ప్రభుత్వం నుంచి అందిన ఆదేశాల మేరకు రోడ్ల నిర్మాణాలను ఆ తేదీ లోపు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని 15 గ్రామాలలో 20 సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.2.25 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇప్పటికే 15 సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని ఫిబ్రవరి మాసాంతానికి మొత్తం రోడ్ల నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు.